## క్లుప్తంగా

### కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

### వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



క్రీడాకారులకు డైట్ పంపిణీ చేస్తున్న విల్లూరి భాస్కరరావు

జగదాంబ: చిన్నారుల వేసవి శిక్షణ శిబిరాన్ని జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ప్రారంభించారు. శుక్రవారం వార్డులో ఇందిరా మున్సిపల్ క్రికెట్ స్టేడియంలో ఆదరణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విల్లూరి మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లు చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. చదువుతో పాటు ఆటపాటలు కూడా ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



వృద్ధురాలికి రక్త పరీక్ష చేస్తున్న మలేరియా సిబ్బంది

అల్లిపురం: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని 33వ వార్డులో మలేరియా సిబ్బంది, డాక్టర్ వైఎస్ఆర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. వార్డులోని గోవింద్‌రోడ్డులో ఒక వ్యక్తికి డెంగ్యూ వ్యాధి సోకటంతో ఆ ప్రాంతంలో శుక్రవారం ఇంటింటి సర్వే చేపట్టారు. అనుమానం ఉన్నవారికి మలేరియా సిబ్బంది పట్నాయక్, వర్దన్, అప్పారావు, మురళి, ఆశ వర్కర్ లీలావతి రక్త పరీక్షలు చేశారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు.

### వార్డు కార్యాలయాన్ని సందర్శించిన ఏఎంహెచ్‌వో



ఫేస్ రికగ్నిషన్ సిస్టం పనితీరును పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో డాక్టర్ కిషోర్

అల్లిపురం: జీవీఎంసీ సిబ్బంది పనితీరును పరిశీలించేందుకు జోన్–4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిషోర్ శుక్రవారం వార్డు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది ఫేస్ రికగ్నేషన్ సిస్టం పనితీరును పరిశీలించారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# చదువుల గుడి

దశాబ్దాల క్రితం షెడ్లలో ప్రారంభమైన విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల దినదినప్రవర్ధమానమై నేడు కార్పొరేట్ కళాశాలలతో పోటీ పడుతూ విద్యార్థినులను తీర్చిదిద్దుతోంది. చదువుతో పాటు పలు అంశాల్లో వారిని మెరికల్లా తయారు చేస్తోంది. మహానేత వైఎస్సార్ చొరవతో ఎక్కడో బీచ్‌రోడ్డులో ఉండే ఆ కళాశాల నగర నడిబొడ్డు జైల్‌రోడ్డులో విద్యా కుసుమాలు పూయిస్తోంది.

- విద్యార్థినులను తీర్చిదిద్దుతున్న విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
- ప్రారంభంలో బీచ్‌రోడ్డు హవా మహల్‌లో నిర్వహణ
- మహానేత వైఎస్సార్ చొరవతో నగర నడిబొడ్డుకు మార్పు
- ఎంతో మంది పేద పిల్లలకు విద్యలో చేయూత



పేద విద్యార్థుల కల్పవృక్షం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల




కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా నిర్వహణ..

దాబాగార్డెన్స్: చదువు కోసం భారీ ఎత్తున ఖర్చు పెట్టలేని సాధారణ తల్లిదండ్రులకు ఆ విద్యా నిలయం కొండంత అండగా నిలుస్తోంది. వారికి గుండె ధైర్యాన్నిస్తోంది. కార్పొరేట్ కళాశాల స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తోంది. చదువే కాక క్రమశిక్షణ అలవాటు చేస్తూ భవిష్యత్తులో వారి అభివృద్ధికి ఆసరా ఇస్తోంది. క్రీడా, సాంస్కృతిక రంగాల్లో రాణించేలా చేస్తోంది. ఆహ్లాదకర వాతావరణం.. పచ్చని చెట్లు.. విశాలమైన తరగతి గదులు .. సువిశాల కంప్యూటర్ ల్యాబ్‌తో కళాశాల నడుస్తోంది. నగరం నడిబొడ్డున ఉన్న విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల అమ్మాయిలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. పాత జైలు స్థలంలో విశాఖ ప్రభుత్వ బాలికల కళాశాల, పీజీ కళాశాల నడుస్తున్నాయి. 1992 నుంచి రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న ఈ కళాశాల ఎందరికో దారి చూపుతోంది. ఏడాదికేడాది సరికొత్త గ్రూపులు ఏర్పాటు చేయడమే కాక పోటీ పరీక్షల్లో విద్యార్థులు విజయం సాధించేలా శిక్షణనిస్తోంది. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా విద్యాభ్యాసం జరుగుతోంది. నిపుణులైన అధ్యాపక బృందం విద్యను అందిస్తోంది.

**హవా మహల్‌లో ప్రారంభం..**

బీచ్‌రోడ్డులో ఉన్న హవా మహల్లో రెండు దశాబ్దాల కిందట మహిళా కళాశాల ఉండేది. పేద పిల్లలు చదువుల్లో రాణించాలన్న ఉద్దేశంతో సింగవరపు సూర్యారావు కళాశాలను ఏర్పాటు చేశారు. అప్పట్లో కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవంతో కళాశాలను తీర్చిదిద్దారు. హవామహల్‌కు అప్పట్లో నెలకు రూ.800 అద్దె చెల్లించేవారు. అనివార్య కారణాల వల్ల 1990లో ఈ కళాశాలను వుడా బిల్డింగ్‌లోకి తరలించారు. 1992లో ఇక్కడికి మార్చారు.

**వైఎస్సార్ చొరవతో ప్రగతి..**

1992లో పాతజైల్‌రోడ్డులో ఉన్న బాలల (కొమార) సంస్కరణాలయానికి కళాశాలను బదిలీ చేశారు. నేదురుమల్లి జనార్దనరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1992 మార్చి 28న కళాశాల నూతన ప్రాంగణాన్ని ప్రారంభించారు. అప్పట్లో షెడ్లల్లోనే ఇంటర్మీడియట్, డిగ్రీ తరగతులు జరిగేవి. 2006లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నిధులు మంజూరు చేసి నూతన భవనానికి శ్రీకారం చుట్టారు. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలను అన్ని హంగులతో తీర్చిదిద్దారు.



చదువుల తల్లి నీడలో పేద విద్యార్థులు (ఫైల్)

**ఉన్నత శిఖరాలకు..**

ఈ కళాశాలలో చదివిన విద్యార్థినుల్లో అనేక మంది ఉన్నత చదువులు చదివారు. క్రీడాకారిణులుగా వెలుగొందారు. జాతీయ స్థాయి పోటీల్లో నిలిచారు. డాక్టర్లు, ఇంజనీర్లు, న్యాయవాదులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు.. ఇలా అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. 1977లో ఇదే కళాశాలలో సోషల్ వర్క్‌లో డిగ్రీ పూర్తి చేసిన లావణ్య అనే విద్యార్థిని ప్రస్తుతం అదే కళాశాలలో లెక్చరర్‌గా కొనసాగుతున్నారు.

## కుటుంబ సభ్యుల చెంతకు మానసిక వ్యాధిగ్రస్తుడు

అల్లిపురం: మతిస్థిమితం లేకుండా రైలులో నగరానికి వచ్చి ప్లాట్‌ఫారంపై తిరుగుతున్న వ్యక్తిని భీమ్‌నగర్, ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం సిబ్బంది అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అస్సాంలోని డిబ్రుఘర్‌కు చెందిన కంకన్ సోనోవాల్ మతిస్థిమితం లేకపోవడంతో ఈ నెల 17వ తేదీన రైలులో విశాఖపట్నం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. 4,5 ప్లాట్‌ఫారంపై తిరుగుతుండగా ఆర్పీఎఫ్ పోలీసులు అతనిని ప్రశ్నించడంతో ట్రైన్ మిస్సయింది అని చెప్పాడు. దీంతో వారు భీమ్‌నగర్, ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్‌కు తెలియజేయటంతో వారు అతనికి ఆశ్రయం కల్పించారు. అతని దగ్గర గల ఆధార్ కార్డు ద్వారా అతని వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం నగరానికి చేరుకున్న కుటుంబ సభ్యులకు సోనోవాల్‌ను ఆర్పీఎఫ్ సిబ్బంది సమక్షంలో ఏయూటీడీ ప్రతినిధి ప్రగడ వాసు అప్పగించారు.

## ఘోష ఆస్పత్రిలో సాయంత్రం ఓపీ ప్రారంభం

మహారాణిపేట : ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఏకైక ప్రసూతి ఆస్పత్రిగా పేరొందిన ప్రభుత్వ ఘోష (విక్టోరియా) ఆస్పత్రిలో సాయంత్రం ఓపీలు ప్రారంభమయ్యాయి. రోగులకు చెందిన వివిధ పరీక్షల రిపోర్టులు అదే యూనిట్ వైద్యులు చూడడం కోసం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఓపీ నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషారాణి తెలిపారు. ఉదయం ఓపీలో ఎవరైతే వైద్యులు వున్నారో సాయంత్రం కూడా వారే ఉంటారు. ఇందుకు అవసరమైన వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బందిని నియమించారు. ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో 250 పడకలు ఉన్నాయి.

## వైభవుడికి సుప్రభాత సేవ నేడు

మురళీనగర్: కప్పరాడ ఎస్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు.

# భక్తుల కొంగు బంగారం ఎర్నిమాంబ

- నేడు తొలేళ్ల సంబరం.. ఆదివారం ప్రధాన జాతర



ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: సంతానం లేని దంపతులకు సంతానలక్ష్మిగా, కోరిన వరాలిచ్చే కల్పవల్లిగా జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారు కీర్తి గడించారు. గత వందేళ్లుగా అమ్మవారి చల్లని చూపు కోసం వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. జ్ఞానాపురం –అల్లిపురం అచ్చియ్యమ్మపేట ప్రజల ఇలవేల్పుగా ఎర్నిమాంబ కొలువై ఉన్నారు. భక్తి శ్రద్ధలతో కొలిస్తే కోరికలు నెరవేరతాయనే నమ్మకం భక్తుల్లో ఉంది. 20 శనివారం ఎర్నిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం. 21 ఆదివారం వైభవంగా ప్రధాన జాతర నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

**అమ్మవారి ఆలయ చరిత్ర..**

ఏనభై ఏళ్ల క్రితం విశాఖ కుగ్రామంగా ఉన్న నేపథ్యంలో అప్పటి భక్తులు చిన్నగుడి నిర్మించారు. ఈ ప్రాంతంలో తుప్పలు, డొంకల మధ్య అమ్మవారు వెలసినట్టు భక్తులు చెబుతారు. పదుల సంఖ్యలో మాత్రమే ఇళ్లుండడంతో చీకటి పడితే జనసంచారం ఉండేది కాదు. రాత్రిళ్లు ఈ మార్గంలో వెళ్లేందుకు అందరూ భయపడేవారు. గత నలభై ఏళ్లుగా నివాసితులు పెరగడంతో రోడ్లన్నీ విస్తరించాయి. ఆలయం పక్కగా జీవీఎంసీ అధికారులు రోడ్లు విస్తరించారు. వందేళ్లుగా ఆలయం ఉన్నప్పటికీ గత ఇరవై ఐదేళ్లుగా అమ్మవారిని భక్తులు విశేషంగా పూజిస్తున్నారు. ఎర్నిమాంబ అమ్మవారికి తొమ్మిది మంది అక్కచెల్లెళ్లని పూర్వీకులు చెబుతుంటారు. జ్ఞానాపురంతో పాటు అల్లిపురం అచ్చియ్యమ్మపేట గ్రామ దేవతగా ఆయా గ్రామస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. ప్రతి ఏటా మే నెల మూడో ఆదివారం నిర్వహించే ప్రధాన పండగను అద్వితీయంగా నిర్వహించడం ఆనవాయితీ.



జ్ఞానాపురంలో వెలసిన అమ్మవారి నూతన ఆలయ గోపురం

**భక్తుల కోలాహలం..**

అమ్మవారిని ఆది, మంగళ, గురువారాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటుంటారు. విశాఖ జిల్లాతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి, తూర్పుగోదావరి తదితర ప్రాంతాల నుంచి కుడా భక్తులు అమ్మవారి సందర్శనార్థం వస్తుంటారు. ఆదివారం ఆలయం వద్దే వంటావార్పు చేసుకుని అమ్మవారి చెంతనే ప్రసాదాలు స్వీకరిస్తారు. స్థానికులే అమ్మవారి పేరిట సంఘాన్ని ఏర్పాటు సేవలందిస్తున్నారు. 2007లో సంఘం సభ్యులే దేవాలయాన్ని ఎండోమెంటుకు అప్పగించారు.

### మా ఇంటి ఇలవేల్పు..



చాలా కాలంగా మా ఇంటి ఇలవేల్పుగా కొలుస్తున్నాం. అమ్మవారిని దర్శించుకున్న తరువాతే ఏ పనైనా చేస్తాం. భక్తి శ్రద్ధలతో పూజిస్తే కోరిన కోర్కెలు తప్పక తీరుతాయి.

–బంటుపల్లి నూకరాజు, గురుస్వామి, పూర్ణామార్కెట్,

### అమ్మ దీవెనలు చల్లగా..



మా తాతల కాలం నుంచి మా కుటుంబంలో అందరి పేర్లు ఎర్నిమాంబ అమ్మవారి పేర్లే. సంతాన లక్ష్మిగా కొలుస్తున్నాం. అమ్మ దీవెనలు ఉంటే చల్లగా జీవిస్తాం. అమ్మను నిత్యం పూజలతో కొలుస్తాం.

వాసుపల్లి విజయ, భక్తురాలు, అచ్చియ్యమ్మపేట.

## స్పందన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

దాబాగార్డెన్స్: స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించినట్టు కమిషనర్ సాయికాంత్‌వర్మ తెలిపారు. జీవీఎంసీ పరిధి 8 జోన్లలో ఎటువంటి అనధికార నిర్మాణాలు చేపట్టినా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలు, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా సమస్య తెలపవచ్చు. లేదా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోన్ నంబరు 8187897569కు తెలిపి పూర్తి వివరాలు (డోరు నంబరు, వార్డు నెంబరు, చిరునామా, సమస్య వివరాలు) వాట్సప్‌కు పంపితే సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారా పై అధికారులకు నివేదించి, సమస్యపై సత్వర చర్యలు చేపట్టనున్నట్టు ప్రధాన సిటీ ప్లానర్ బి. సురేష్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం టౌన్‌ప్లానింగ్‌పై స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో జోన్–2 నుంచి రెండు, జోన్–3, 4, 5 నుంచి ఒక్కో ఫిర్యాదు వచ్చాయి. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డబ్ల్యూపీఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షం.. హర్షం



అల్లిపురంలో కురుస్తున్న వర్షం

అల్లిపురం: వారం రోజులుగా ఎండ వేడిమి, ఉక్కపోతతో అల్లాడిన నగర వాసులు శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో సేద దీరారు. ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులు వీయటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వారం రోజులుగా 34 నుంచి 40 డిగ్రీల వరకు ఎండలు విపరీతంగా కాయటంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సాయంత్రం కురిసిన వర్షంతో అంతా హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



34వ వార్డులో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



36వ వార్డు ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం 36వ వార్డు జామియా మసీదు, 34వ వార్డు అచ్చియ్యమ్మపేట వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

**34వ వార్డులో..**

వార్డు పరిధి భూపేష్‌నగర్, లక్ష్మీదేవిపేట ప్రాంతాల్లో ప్రజల వినతి మేరకు అధికారులతో మాట్లాడి మురుగు నీటి సమస్యను పరిష్కరించారు. 39, 35 వార్డుల్లోని సీహార్స్ జంక్షన్‌లో నూతనంగా నిర్మించిన టిడ్కో ఇళ్లకు మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని, ఎలక్ట్రికల్ పోల్స్, లైట్లు వేయాలని కోరగా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, 27వ వార్డు కార్పొరేటర్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, జేసీజే ఇన్‌చార్జి కర్రి సీలకంఠం, వైఎస్సార్‌సీపీ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, బొడ్డేటి ప్రసాద్, దూడ అప్పారావు, బోణి దేవ, బొడ్డేటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

**36వ వార్డులో..**

ఏవీఎన్ కళాశాల దరి జామియా మసీదు వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ త్రినాథ్, జేఏసీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, సభ్యులు చైతన్య, సుధీర్ ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు మంజూరు చేయించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మీ దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొల్లి సింహాచలం, 36వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాసిపోగు రాజు, దశమంతుల మాణిక్యాలరావు, నీలాపు లక్ష్మి, బెహరా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## మురుగు నీటితో అవస్థలు



కుళాయిల్లో వస్తున్న మురుగునీటిని చూపిస్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి, స్థానికులు

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట, అంబేడ్కర్ కాలనీ, లక్ష్మీదేవిపేటలోని కొన్ని ప్రాంతాల్లో మంచినీటి కుళాయిల్లో మురుగునీరు, పురుగులు వస్తున్నాయని వార్డు ప్రజలు కార్పొరేటర్ తోట పద్మావతికి విన్నవించారు. దీంతో ఆమె ఈఈ శేఖర్‌కు, ఎస్ఈ వేణుగోపాలరావుకు తెలియజేయగా, వారు శుక్రవారం ఉదయం వార్డులో పర్యటించారు. వారికి కుళాయిల ద్వారా వస్తున్న మురుగునీరు, పురుగులను స్థానికులు చూపించారు. ఈ మేరకు విచారణ చేపట్టిన అధికారులు మంచినీటి పైప్‌లైన్లలో మురుగునీరు కలుస్తున్న ప్రదేశాలను గుర్తించి 48 గంటల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ అభ్యర్థన మేరకు వచ్చిన అధికారులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్య చెప్పిన వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేసిన కార్పొరేటర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాసవర్మ, ఏఈ రవికుమార్, వాసుదేవన్, వార్డు సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఔదార్యం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం నియోజకవర్గ పరిధిలో గల పలువురికి ఆర్థిక సాయం అందజేశారు. రంగిరీజు వీధికి చెందిన దొండపర్తి రాము పక్షవాతంతో బాధపడతున్న దృష్ట్యా రూ.5వేలు, ఏవీఎన్ కాలేజీ సమీపాన నివశిస్తున్న బంగారు సుబ్బారావుకు రూ.5 వేలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పెట్లి వినయ్ అనారోగ్య కారణంగా చనిపోవడంతో తండ్రి పాపారావు మానసికంగా బాధపడతున్న దృష్ట్యా వైద్య ఖర్చుల కోసం రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 36వ వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు, 30వ వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, నీలాపు లక్ష్మి, బెహర వెంకటరత్నం, ముజీబ్‌ఖాన్, ఖాజావలీ, బెవర మహేష్, కాసారపు వాసు, అరుగుల రాజు, దశమంతుల చిన్ని, రమణి, ఆలేటి వెంకట్రావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్ర పార్టీ కరపత్రం విడుదల

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర పార్టీ ఆవశ్యకతపై ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టా రామారావు శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పార్టీ ప్రత్యేక రాష్ట్రం సాధన దిశగా రాబోవు ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు. ప్రస్తుతానికి పార్టీ నిర్మాణం, ఎన్నికల సమయాత్తం జరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వాలన్నీ ఉత్తరాంధ్రపై శీతకన్ను వేశాయని, ఈ ప్రాంతానికి వివిధ శాఖల ద్వారా రావల్సిన నిధులు రాలేదన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నత్త నడకన నడుస్తోందన్నారు. ఉత్తరాంధ్రలో ఉపాధి కల్పన చేయకపోవడంతో ఇక్కడి వారు కూలీలుగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లడం దారుణమన్నారు. వంశధార నదిపై నేరేడి వద్ద బ్యారేజ్ నిర్మించాలన్న ప్రయత్నం సఫలం కాలేదన్నారు. ఉత్తరాంధ్ర భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త రాష్ట్రం ద్వారానే అభివృద్ధి సాధ్యమన్నారు.

## మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ జైన్, అసోసియేషన్ సభ్యులు

దాబాగార్డెన్స్: ఎండలు ఎక్కువగా ఉన్న కారణంగా, బాటసారులు.. వాహనచోదకుల దాహార్తి తీర్చేందుకు సూర్యాబాగ్‌లో విశాఖ ఎలక్ట్రికల్ డీలర్స్ అసోసియేషన్ శుక్రవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టింది. కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ సభ్యులు చేపట్టిన సేవా కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు, మట్టపల్లి చలమయ్య చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మట్టపల్లి హనుమంతరావు, కార్యదర్శి రాజేష్ జైన్, సభ్యులు రాకేష్ జైన్, రవికుమార్, మహేంద్రగుప్తా, స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## టెంట్ హౌస్ దగ్ధం



షాపు నుంచి ఎగసిపడుతున్న మంటలు

మల్కాపురం : విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌లో గురువారం అర్ధరాత్రి ఓ టెంట్ హౌస్ నుంచి మంటలు ఎగసి పడ్డాయి. షాప్‌ను ఆనుకుని పక్కనే ఉన్న ఓ ఇంటి హౌస్ వైరింగ్ దగ్ధమైంది. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటల్ని అదుపు చేశారు. మల్కాపురం పోలీసులు చెప్పిన వివరాలు. శ్రీనివాస్‌నగర్‌లో శ్రీను అనే వ్యక్తి సప్లయర్స్(టెంట్ హౌస్) దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి తన షాపును మూసేసి, ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో షాపు నుంచి మంటలు రావటం మొదలైంది. దాన్ని చూసిన స్థానికులు మంటల్ని ఆపే ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవడంతో పెదగంట్యాడ అగ్నిమాపక అధికారులకు, మల్కాపురం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక శకటం మంటల్ని ఆర్పేసినా, అప్పటికే సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. అయితే ఈ ప్రమాదానికి కారణాలను అగ్నిమాపక అధికారులు చెప్పలేకపోతున్నారు. దీనిపై మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీసులకు యోగా తరగతులు



యోగా చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

దొండపర్తి: బ్రహ్మకుమారీ సంస్థ ఆధ్వర్యంలో సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో శుక్రవారం పోలీసులకు యోగా తరగతులు నిర్వహించారు. పోలీసులు విధి నిర్వహణలో ఒత్తిడికి గురికాకుండా మానసికంగా దృఢంగా ఉండేందుకు సీపీ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో ఏడీసీపీ(ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం, ఏసీపీ(ఏఆర్) ఆర్.పి.ఎల్.శాంతికుమార్, ఆర్ఐలు, ఇతర అధికారులు, పెద్ద సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు. పని ఒత్తిడి నుంచి బయటపడి మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం, సిబ్బందికి మనోధైర్యం పెంపొందే పలు మార్గాలను బ్రహ్మకుమారీ సంస్థ ప్రతి నిధులు వివరించారు.